E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 10-09-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



గ్రూప్-1పై అప్పీలుకెళ్దామా? 3లో

## 'యంగ్ ఇండియా' స్కూళ్లకు మద్దతు తెలపండి: సీఎం

రాష్ట్ర రుణాల పునర్వ్యవస్థీకరణకు అనుమతివ్వండి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



తరువాయి 2లో

## కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



- ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఘన విజయం
- తమిళనాడు నుంచి ఈ పదవిని చేపట్టనున్న మూడో నేతగా ఘనత
- ఇండియా కూటమి నుంచి పలువురు ఎంపీల క్రాస్‌ఓటింగ్
- రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు
- ఎంపీల తీర్పును అంగీకరిస్తున్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రకటన

### ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 తొలి ప్రాధాన్యత ఓట్లు

### 152 ఓట్ల తేడాతో గెలుపొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి.... మొత్తం పోలైన ఓట్లు 767.. వాటిలో చెల్లనివి 15 ఓట్లు

### 98.20 శాతంగా నమోదైన పోలింగ్.. ఓటింగ్‌కు గైర్హాజరైన 13 మంది ఎంపీలు

### సుదర్శన్‌రెడ్డికి 324 ఎంపీల మద్దతుందని భావించినా 300 ఓట్లకే పరిమితం

ఈకబురు, న్యూఢిల్లీ: దేశ 15వ ఉపరాష్ట్రపతిగా బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) తరఫున పోటీ చేసిన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఆయన ఘన విజయం సాధించారు. రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 300 ఓట్లు పొందారు. దీంతో 152 ఓట్ల తేడాతో రాధాకృష్ణన్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ మంగళవారం రాత్రి ప్రకటించారు. దీంతో రాధాకృష్ణన్ త్వరలోనే ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేపట్టనున్నారు. తమిళనాడు నుంచి ఈ పదవిని అధిష్టించిన సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకట్రామన్‌ల తర్వాత మూడో నాయకుడిగా సీపీ రాధాకృష్ణన్ చరిత్రకెక్కారు.

ఘన విజయం...

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నూతన పార్లమెంట్ భవనంలోని 'వసుధ ఎఫ్-101'లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్‌లో మొత్తంగా 767 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 6, లోక్‌సభలో ఒక ఖాళీ స్థానాన్ని పక్కనబెడితే లోక్‌సభలో 542 మంది, రాజ్యసభలో 239 మంది కలిపి 781 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ముందే ప్రకటించినట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు బీజేడీ ఎంపీలతోపాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఒకరు, స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్‌సింగ్ ఖల్సా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మొత్తంగా 767 (98.2 శాతం) ఓట్లు పోలయ్యాయి. విజయానికి అవసరమైన ఓట్లను 377గా నిర్ణయించారు.

సాయంత్రం 6 గంటల నుంచి ఓట్లను లెక్కించి రాత్రి 7:30 గంటలకు ఫలితాన్ని ప్రకటించారు. మొత్తం పోలైన 767 ఓట్లలో చెల్లని ఓట్లు 15 ఉండగా మిగిలిన 752 ఓట్లలో రాధాకృష్ణన్‌కు 452 మొదటి ప్రాధాన్యతా ఓట్లు లభించాయని.. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీసీ మోదీ ప్రకటించారు.

తరువాయి 2లో


## అమెరికాతో దౌత్య బృందాలు చర్చిస్తున్నాయి: నిర్మలా సీతారామన్

» 4లో



## యాక్సిడెంట్ వార్తలపై స్పందించిన కాజల్..

» 5లో



## నేపాల్ అగ్నిగుండం



- యువత ఆందోళనలు హింసాత్మకం.. పార్లమెంట్ సహా సుప్రీంకోర్టు, ప్రముఖుల ఇళ్లకు నిప్పు
- ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా.. అదే బాటలో అధ్యక్షుడు రామచంద్ర, మంత్రులు
- నేతల ఇళ్లపై దాడులు, నిప్పు.. కాలిన గాయాలతో మాజీ ప్రధాని ఖనాల్ భార్య మృతి
- ఆర్థిక, విదేశాంగ శాఖల మంత్రులపై దాడులు.. ఆర్మీ బ్యారక్‌లకు ప్రముఖులు
- సైన్యం చేతికి పాలన?.. తదుపరి ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షాకు అవకాశం?

ఈకబురు, కఠ్మాండూ : సామాజిక మాధ్యమాలపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన యువత ఉద్యమం.. నేపాల్ ప్రభుత్వాన్ని దించేసింది. సోమవారం మొదలైన ఆందోళనలు.. మంగళవారం హింసాత్మకంగా మారాయి. దీంతో.. హిమాలయ దేశం అగ్నిగుండంగా మారింది. నిరసనకారులు అధికారపక్షం.. విపక్షం అని చూడకుండా.. ప్రధాని సహా.. మంత్రులు, మాజీ ప్రధానుల ఇళ్లపై దాడులు జరిపారు. వారి అధికారిక, ప్రైవేటు ఇళ్లకు నిప్పు పెట్టారు. మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పు అంటించగా.. ఆ మంటల్లో ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవ దహనమయ్యారు. ఆర్మీ కొందరు మంత్రులు, వీఐపీలను హెలికాప్టర్లలో తమ బ్యారక్‌లకు తరలించగా.. ఆ అవకాశం లేని మంత్రులపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. మహిళా మంత్రులపైనా విచక్షణారహితంగా పిడిగుద్దుల వర్షం కురిపించగా.. ఆర్థిక మంత్రిని నడిరోడ్డుపై తన్నుతూ.. తరిమి కొట్టారు. ఈ పరిణామాల మధ్య ప్రధాని కేపీ ఓలి రాజీనామా చేయగా.. దాన్ని ఆమోదించిన దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ కూడా తన పదవిని త్యజించారు. మాజీ ప్రధాని ప్రచండ పిలుపుతో యువత ఆందోళన పగ్గాలను అందుకునేందుకు కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా (బాలెన్) సిద్ధమయ్యారు. తాజా పరిణామాల నేపథ్యంలో నేపాల్‌లో పాలన పగ్గాలను ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ చేపట్టే అవకాశాలున్నాయి.

తరువాయి 2లో

## 2027 డిసెంబరుకు ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి



- ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగం తవ్వకాన్ని 2027 డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేస్తామని నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించా..
- డిండి ఎత్తిపోతల పథకం కూడా పూర్తి చేస్తాం : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

తరువాయి 2 లో

## సామాజిక తెలంగాణే ధ్యేయం

» 2లో



## కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరును పక్కన పెట్టారు



- లేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు,
- మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర నాయకులు
- సీఎం రేవంత్‌పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజం

తరువాయి 2లో

## మావోయిస్టుల దళపతిగా దేవ్‌జీ!



- పార్టీ మూడో చీఫ్‌గా కోరుట్ల వాసి నియామకం
- హిడ్మాకు దండకారణ్యం బాధ్యతల అప్పగింత..?

ఈకబురు, హైదరాబాద్ జగిత్యాల, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ కొత్త దళపతిగా తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ(62) నియమితులైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. లొంగిపోయిన కేడర్ ద్వారా నిఘా సంస్థలకు ఈ సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మే 21న అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్వరాజ్‌తోపాటు 28 మంది మావోయిస్టులు మృతి చెందడటంతో పార్టీకి సారథ్యం కరవైంది. కొద్దిరోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కీలక నేతల భేటీలో దేవ్‌జీ నియామకంపై నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిరుపతిది దళిత కుటుంబ నేపథ్యం. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన తిరుపతి ఇంటర్ వరకు చదివిన అనంతరం 1980 దశకంలో నాటి పీపుల్స్‌వార్‌లో చేరారు. అప్పట్లో జగిత్యాల జైత్రయాత్రతో ఉత్తర తెలంగాణలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రభావంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1983లో డిగ్రీ చదువును మధ్యలోనే వదిలేసి రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) భావజాలానికి ఆకర్షితుడయ్యారు. తర్వాత ఉద్యమంలో ప్రవేశించారు.

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# నేపాల్ అగ్నిగుండం




**అర్ధరాత్రి నుంచి హింసాత్మక ఘటనలు**

నేపాల్ పార్లమెంట్ వద్ద పోలీసులు సోమవారం రబ్బర్ బుల్లెట్లతో జరిపిన కాల్పుల్లో 20 మంది మరణించడంతో.. సోషల్ మీడియాను పునరుద్ధరించిన ప్రభుత్వం.. రాత్రి 10 గంటల సమయంలో మాటమార్చింది. ప్రభుత్వాదేశాలతో సైన్యం, పోలీసులు ప్రజల ఇళ్లలోకి వెళ్లి, వందల సంఖ్యలో యువతను అరెస్టు చేశారు. దీంతో.. అర్ధరాత్రి నుంచి నేపాల్ భగ్గుమంది. ప్రధాని ఓలి ఇంటిపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. వేర్వేరు సంఘటనల్లో మరో ఇద్దరు ఆందోళనకారులు మృతిచెందారు. దీంతో.. మంగళవారం ఉదయం నుంచి హింస ఉధృత రూపు దాల్చింది. సోషల్ మీడియాపై నిషేధం విధించాలని ఆదేశించిన సుప్రీంకోర్టు భవనాన్ని ఆందోళనకారులు టార్గెట్‌గా చేసుకున్నారు. సుప్రీంకోర్టుతోపాటు.. పలు న్యాయస్థానాలకు నిప్పుపెట్టారు. ప్రధాని ఓలి ప్రైవేటు ఇంటిని తగులబెట్టారు. దేశాధ్యక్షుడి నివాసం 'శీతల్ నివాస్', కార్యాలయాన్ని దహనం చేశారు. సోమవారం నాటి హింసకు సాక్షిగా ఉన్న పార్లమెంట్ భవనం అగ్నికీలల్లో మండిపోతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మాజీ ప్రధానులు డాక్టర్ బాబూరాం భట్టరాయ్(నేపాల్ సోషలిస్ట్ పార్టీ చీఫ్), పుష్పకమల్ దహాల్(ప్రచండ), షేర్ బహదూర్ దేవుబా(నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు), జలనాథ్ ఖనాల్ ఇళ్లకు నిరసనకారులు నిప్పంటించారు. జలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవదహనమైనట్లు నేపాలీ పత్రికలు పేర్కొన్నాయి. అయితే.. కొన ఊపిరితో ఉన్న ఆమె ఆస్పత్రిలో చనిపోయినట్లు ఇండియాటుడే ప్రచురించింది. దేవుబా ఇంటిని తగులబెట్టడానికి ముందు ఆందోళనకారులు అక్కడున్న వారిపై భీకర దాడులు చేశారు. దేవుబా, ఆయన భార్య, నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి అర్జూ రాణా దేవుబాపై విచక్షణారహితంగా దాడులు చేసిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఇక ఆర్థిక శాఖ మంత్రి, 65 ఏళ్ల వయసున్న బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను ఆందోళనకారులు వీధుల్లో తరిమికొట్టారు. ప్రభుత్వ ఆఫీసులకు నిప్పుపెట్టారు.

**ఆర్మీ బ్యారెక్‌లకు ప్రముఖులు**

నేపాల్‌లో హింస నేపథ్యంలో అధికారులు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం సహా.. అన్ని ఎయిర్‌పోర్టులను మూసివేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 300 మంది సైనికులు పహారాకాస్తున్నారు. ప్రముఖులు దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో.. సైన్యం తమ హెలికాప్టర్లలో వారిని ఆర్మీ బ్యారెక్‌లకు తరలించింది. కఠ్మాండూలోని ఆర్మీ బేస్‌లలో ప్రధాని ఓలి సహా.. పలువురు మంత్రులు, అధికారులు, వీఐపీలు ఉన్నట్లు తెలుస్తోంది.

**రంగంలోకి ఆర్మీ..**

'ఓలీ రాజీనామా చేయాలి..'.. 'కేపీ చోర్.. నేపాల్ చోడ్(కేపీ శర్మ ఓ దొంగ.. ఆయన నేపాల్‌ను వీడాలి)..'.. అంటూ యువత ఉద్యమం ఊపందుకోవడంతో.. మంగళవారం ఉదయం ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్డెల్ ప్రధాని ఓలిని కలిశారు. "మీరు రాజీనామా చేస్తే తప్ప పరిస్థితి సద్దుమణిగేలా లేదు. మీరు రాజీనామా చేస్తే.. ఆందోళనల విరమణకు యువతను ఒప్పిస్తాం" అని ఆయన కోరినట్లు తెలిసింది. దాంతో ఓలి రాజీనామా చేశారు. ఆయన భరోసా ఇవ్వడంతోనే.. ఓలి దేశాన్ని వీడకుండా కఠ్మాండూలోనే ఉండిపోయినట్లు సమాచారం. ఆ వెంటనే "యువత సంయమనం పాటించాలి.. ఓలి రాజీనామా చేశారు" అంటూ ఓ ప్రకటన చేశారు. చర్చలకు రావాలంటూ యువతను ఆహ్వానించారు. ఈ పరిణామాలను బట్టి.. పాలనపగ్గాలను ఆర్మీ చీఫ్ తాత్కాలికంగా చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయం నుంచి కఠ్మాండూ సహా.. సమస్యాత్మకంగా మారిన జిల్లాల్లో ఆర్మీ మోహరించింది. యువత ఆందోళనలను వీడకుంటే.. కఠిన చర్యలు తీసుకునే అవకాశాలుంటాయంటూ మైకుల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**ప్రధాని పదవిపై బాలెన్, రవి ఫోకస్**

తదుపరి నేపాల్ ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా(బాలెన్) పేరు వినిపిస్తోంది. సోమవారం రాత్రే మాజీ ప్రధాని ప్రచండ యువత ఉద్యమానికి నాయకత్వం వహించాలని బాలెన్‌ను కోరడం గమనార్హం..! ప్రధాని రాజీనామా తర్వాత బాలెన్ యువతను



ఉద్దేశించి ప్రసంగించారు. ఆందోళనలను విరమించుకోవాలని కోరారు. అయితే.. ఆందోళనకారులు మాత్రం.. రాజీనామాలు సరిపోవని, అవినీతి నాయకులను జైళ్లకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. బాలెన్ తర్వాత.. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ(ఆర్‌ఎస్‌పీ) అధ్యక్షుడు రవి లామిచానే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఓలి ప్రభుత్వం రవిని జైలులో పెట్టగా.. ఆయనను అధికారులు మంగళవారమే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

**జైళ్ల ధ్వంసం.. ఖైదీల పరారీ**

నేపాల్ ఆందోళనలను పలు జైళ్లలోని ఖైదీలు అవకాశంగా మలచుకున్నారు. జలేశ్వర్ జైలులో 576 మంది ఖైదీలుండగా.. 575 మంది గేట్లను బద్దలుకొట్టి పారిపోయారు. కాస్కీ జైలులో 981 మంది ఖైదీల్లో 900 మంది, తులసీపూర్‌లో 179 మంది ఖైదీలకుగాను 124 మంది, నక్షీ జైలులో 90 మంది పరారయ్యారు. దీంతో.. పలు జైళ్లలో ఖైదీలు ఆందోళనలు చేశారు. ఆందోళనలు ఉధృతమవుతుండడంతో.. ఆయా జైళ్ల అధికారులు ఖైదీలను స్వచ్ఛందంగా విడుదల చేశారు. దేశవ్యాప్తంగా వివిధ జైళ్లనుంచి విడుదలైన/పారిపోయిన ఖైదీల సంఖ్య 6,500గా ఉన్నట్లు నేపాల్ పత్రికలు పేర్కొన్నాయి. కాగా, ఆందోళనకారులు పార్లమెంటు భవనంలో వస్తువులను, తుపాకులను ఎత్తుకెళ్లారు.

మొదటి పేజీ తరువాయి

# సామాజిక తెలంగాణే ధ్యేయం



**ఈ-కబురు, సామాజిక తెలంగాణ సాధనే తమ ధ్యేయమని, ఈ ప్రక్రియలో కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తినే ఆదర్శంగా తీసుకుంటామని కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ కోసం ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. కాళేశ్వరం కూలిందన్న సీఎం ఆ ప్రాజెక్టులో భాగమైన.. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెచ్చే ప్రాజెక్టుకు శంకుస్థాపన ఎలా చేశారని ప్రశ్నించారు.**

మొదటి పేజీ తరువాయి

# కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



**అనుకున్నట్లే క్రాస్ ఓటింగ్**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అందరూ ఊహించినట్లే క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలిసింది. ఇండియా కూటమిలోని పక్షాలు, తమకు మద్దతుగా వచ్చిన ఆప్ సహా ఇతర చిన్నాచితక పార్టీలతో కలిసి కాంగ్రెస్ కనీసం 324 ఓట్లు వస్తాయని అంచనా వేసింది. పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడ్డాయి. కూటమికి చెందిన 315 మంది ఎంపీల్లో అందరూ ఓటింగ్ కోసం హాజరయ్యారు'అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే 15 ఓట్లు క్రాస్ ఓటింగ్ అయ్యాయి. దీంతోపాటు చెల్లని ఓట్లు సైతం ఇండియా కూటమి పక్షాలవేనని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే 20-25 ఓట్లు ఎన్డీఏ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు రాధాకృష్ణన్‌కు ఎన్డీయే కూటమిలోని 427 మంది ఎంపీల మద్దతు ఉందని బీజేపీ కాగితంపై లెక్కలేసుకోగా పోలింగ్‌లో మాత్రం అంతకన్నా ఎక్కువగానే ఓట్లు లభించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో నిర్వహించిన సమర్థవంతమైన ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కారణంగా ఎన్డీయే సునాయాశ విజయం సాధించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీఏ కూటమి పక్షాలకు రెండ్రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు, మిత్రపక్షాలతో సమన్వయం, పోలింగ్‌కు ముందు ప్రాంతాలవారీగా ఎంపీలతో సమన్వయం రాధాకృష్ణన్ గెలుపునకు దోహదం చేసిందని చెబుతున్నారు.

**మిన్నంటిన సంబరాలు..**

సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన వెంటనే బీజేపీలో సంబరాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసం ముందు తమిళనాడు సంప్రదాయాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ఎంపీలతోపాటు ఆయనకు మద్దతిచ్చిన పక్షాల ఎంపీలు శుభాకంక్షలు తెలిపారు.

**రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు**

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర అమిత్ షా సహా పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్ట్‌లు చేశారు. 'ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు అభినందనలు. ప్రజాజీవితంలో దశబ్దాల గొప్ప అనుభవం, దేశ పురోగతికి గణనీయంగా దోహదపడుతుంది. విజయవంతమైన, ప్రభావవంతమైన పదవీకాలం కోసం మీకు ఇవే నా శుభాకాంక్షలు'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సందేశాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రాధాకృష్ణన్‌కు ఎంపీగా, వివిధ రాష్ట్రాల గవర్నర్‌గా గొప్ప అనుభవం ఉంది. ఆయన పార్లమెంటరీ జోక్యాలు ఎల్లప్పుడూ చురుకైనవి. గవర్నర్‌గా పదవీకాలంలో, సాధారణ పౌరులు ఎదుర్కొన్న సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టారు. ఈ అనుభవాలు ఆయనకు శాసన, రాజ్యాంగ విషయాలపై అపార జ్ఞానం ఉందని నిర్ధారించాయి. ఆయన స్ఫూర్తిదాయకమైన ఉపరాష్ట్రపతి అవుతారని నాకు నమ్మకం ఉంది'ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ నాయకత్వ లక్షణాలను, పరిపాలనపై ఆయనకున్న లోతైన జ్ఞానాన్ని అమిత్ షా ప్రశంసించారు. రాధాకృష్ణన్ అనుభవం, అట్టడుగు స్థాయి నేపథ్యం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అణగారిన వర్గాలకు సేవ చేయడానికి సహాయపడతాయని షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగువ సభ సంరక్షకుడిగా ఆయన కొత్త పాత్రలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి పెదవివిప్పని జగ్‌దీప్ ధన్‌ఖడ్.. సీపీ రాధాకృష్ణన్ విజయం నేపథ్యంలో తొలిసారి స్పందించారు. ప్రజాజీవితంలో రాధాకృష్ణన్‌కు ఉన్న అపార అనుభవంతో ఉపరాష్ట్రపతి కార్యాలయం మరింత ఖ్యాతిని పొందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు లేఖ రాశారు.

**ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నాం: ఖర్గే**

'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి పోరాటానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంప్రదాయాల అత్యున్నత నైతికతను నిలబెట్టుకుంటారని, ప్రతిపక్షాలకు గౌరవాన్ని ఇస్తారని, ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నా. వర్షాకాల సమావేశాల్లో జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు, ఇది ఎందుకు అనేది ఎప్పటికీ వివరించలేం. రాజ్యాంగ స్థానాలపట్ల గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# 'యంగ్ ఇండియా' స్కూళ్లకు మద్దతు తెలపండి: సీఎం




**ఈకబురు, దిల్లీ: తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం రాష్ట్రంలో 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నందున అందుకు అవసరం అయ్యే ఆర్థిక వనరుల సమీకరణకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయన మంగళవారం ఇక్కడి నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. "ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయి. మిగతా వాటికి టెండర్లు ముగిశాయి. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నాం. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు ఖర్చు చేయనున్నాం. వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమయ్యే నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు.**

**భారంగా అప్పుల చెల్లింపు**

**గత ప్రభుత్వం అధిక వడ్డీలకు ఇష్టారీతిగా రుణాలు తేగా వాటిని చెల్లించడం రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి పునర్వ్యవస్థీకరణకు అనుమతించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నిర్మలా సీతారామన్‌ను కోరారు. సీఎం విజ్ఞప్తులకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాంనాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. ఎంపీలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు.**

# కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరును పక్కన పెట్టారు



ఈకబురు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, తిమ్మాజీపేట, న్యూస్‌టుడే: కేసీఆర్ నాయకత్వంలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90 శాతం పూర్తయ్యాయని.. ఈ ప్రభుత్వం మిగిలిన పది శాతం ఎందుకు పూర్తిచేయడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచలో మంగళవారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డిలతో కలిసి హాజరై కేటీఆర్ మాట్లాడారు. అనంతరం జడ్చర్లలో విలేకరుల సమావేశంలోనూ మాట్లాడారు. 'పాలమూరు ప్రాజెక్టును కాదని రూ.4 వేల కోట్లతో కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతలకు టెండర్లు పిలిచారు. అనుమతులు లేకపోవడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్టే ఇచ్చింది. పదేళ్ల పాలనలో కేఎల్ఐ, నెట్టెంపాడు, భీమా తదితర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి 8 లక్షల ఎకరాలకు నీరిచ్చాం. పాలమూరు బిడ్డగా చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డి అరపైసా పనిచేయకుండా.. పాలమూరు ప్రాజెక్టుకు ఆయన మామ జైపాల్‌రెడ్డి పేరు పెట్టుకున్నారు. కేసీఆర్‌కు పేరొస్తుందనే ఈ ప్రాజెక్టును రేవంత్ పూర్తిచేయడం లేదు' అని విమర్శించారు. కాళేశ్వరం 85 పిల్లర్లలో రెండింటికి ఇబ్బందొస్తే అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరిస్తున్నారని దుయ్యబట్టారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ఓ టీవీ ఇంటర్వ్యూలో పీసీసీ అధ్యక్షుడే చెప్పారని.. ఇంకా విచారణ అవసరం లేదన్నారు.

**గ్రూప్-1 అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి**

గ్రూప్ 1 పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు అనంతరం హైదరాబాద్‌లో పలువురు అభ్యర్థులు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. "కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రశ్నపత్రం లీక్ అయిన వెంటనే.. తప్పును సరిదిద్దడం కోసం పరీక్షను రద్దు చేశాం. కానీ, ఈ ప్రభుత్వం 500 పోస్టులకు 63 మాత్రమే కలిపి.. గ్రూప్ 1 నోటిఫికేషన్ పేరిట అడ్డగోలుగా పరీక్షలు నిర్వహించి అవకతవకలకు పాల్పడింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, గ్రూప్ 1లో అవకతవకలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి" అని డిమాండ్ చేశారు.

**మళ్లీ చెబుతున్నా.. లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధం**

ఫార్ములా ఈ కేసు వ్యవహారంలో ఎలాంటి తప్పు జరగలేదని తాను మళ్లీ చెబుతున్నానని.. ఈ విషయంలో ఎవరైనా వచ్చి లైడిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని కేటీఆర్ తెలిపారు. "హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచేందుకు ఈ రేస్‌ను తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేశా. ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని నేనే ఆదేశాలు జారీ చేశా. ఆ డబ్బులు నేరుగా నిర్దేశిత ఖాతాలోకి చేరాయి. ఇందులో ఒక్క రూపాయీ తారుమారు కాలేదు. ఇక అవినీతి ఎక్కడిది..? ప్రాసిక్యూషన్ చేసినా.. ఛార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరు. ప్రజాసమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే మళ్లీ ఈ కేసును ముందుకు తెచ్చారు" అని కేటీఆర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# 2027 డిసెంబరుకు ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి



ఈకబురు, ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగం తవ్వకాన్ని 2027 డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేస్తామని నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దీనిద్వారా 4 లక్షల ఎకరాలకు గ్రావిటీతో సాగునీటిని, సురక్షితమైన తాగునీటిని అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నెలకు రూ.1.2 కోట్ల కరెంట్ బిల్లుల భారం తప్పుతుందని ఆయన తెలిపారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మంగళవారం జలసౌధలో ఆయన ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష జరిపారు. టన్నెల్ కోసం మ్యాగ్నెటిక్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. టన్నెల్ పునరుద్ధరణపై అధికారులు రూపొందించిన నివేదిక, సవరణ అంచనాలపై 15వ తేదీన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్లు ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే హైలెవల్ కెనాల్ ద్వారా ఉదయసముద్రం ప్రాజెక్టుకు నీటిని తరలించి, లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. లోలెవల్ కెనాల్ ద్వారా 80,000 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా 8 రిజర్వాయర్ల కింద 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నామన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి దుందుభి నదిలో నీటిని పోసి... రబ్బర్ డ్యామ్ కట్టి, నీటిని డిండి ఎత్తిపోతల పథకం కింద మళ్లిస్తామని, ఈ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి చేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీకి అనుబంధంగా నిర్మించిన ఉదయసముద్రం పనులు ఇప్పటికే 70 శాతం మేర పూర్తికాగా.. మిగిలిన పనుల పూర్తిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ పనులు 93 శాతం మేర పూర్తయ్యాయని.. గంధమల్ల రిజర్వాయర్ పరిధిలోని రావల్‌కోల్ లింక్ కెనాల్, తురకపల్లి పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉండి.. తుది దశలో ఉన్న ప్రాజెక్టులకు నిధు లు కేటాయించాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు.

**ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ టన్నెల్: కోమటిరెడ్డి**

ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయితే ప్రపంచంలో అతిపెద్ద ఇరిగేషన్ టన్నెల్‌గా నిలవనుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాజకీయ దురుద్దేశంతో పదేళ్లు ఈ ప్రాజెక్టును పక్కనపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్కట్‌పల్లి మండలం జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఒకటని.. అందుకే బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు చేపట్టామని గుర్తుచేశారు. రూ.3 వేల కోట్లు ఖర్చుచేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రాజెక్టున్నీ పూర్తవుతాయన్నారు.

# మావోయిస్టుల దళపతిగా దేవ్‌జీ!

తెలుగు, హిందీ, గోండి భాషలు మాట్లాడే తిరుపతి పార్టీలో దేవ్‌జీ, సంజీవ్, సుదర్శన్, కుమ్మూదాదా అనే మారుపేర్లతో చలామణి అవుతున్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు ఇన్‌ఛార్జిగా ఉంటూ సెంట్రల్ రీజినల్ బ్యూరో(సీఆర్‌బీ)కు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. పొలిట్ బ్యూరోలో సభ్యుడిగానూ ఉన్నారు. 2010లో దంతెవాడలో 74 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను హతమార్చిన ఉదంతంతోపాటు చంద్రబాబునాయుడిపై అలిపిరి దాడి ఘటనలో దేవ్‌జీ కీలకంగా వ్యవహరించినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. ఎన్ఐఏకు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్న దేవ్‌జీపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఎన్ఐఏకు సంబంధించిన రూ.కోటి వరకు రివార్డు ఉంది. మావోయిస్టు పార్టీ చరిత్రలో కేంద్ర కమిటీ కార్యదర్శిగా జగిత్యాల జిల్లాకు చెందిన గణపతి తర్వాత ఇదే జిల్లాకు చెందిన తిరుపతికి మరోసారి అవకాశం దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకటో బెటాలియన్ కమాండర్ మడావి హిడ్మాను దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) కార్యదర్శిగా నియమించినట్లు తెలుస్తోంది.



# తీరు మారని ఓక్రిడ్జ్ స్కూల్ నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్...



అక్రమ పార్కింగ్ తో ఓక్రిడ్జ్ ముందు స్థంబించిన ట్రాఫిక్



రహదారిని ఆక్రమించి చేపట్టిన వాహనాల పార్కింగ్



రహదారిని ఆక్రమించి చేపట్టిన వాహనాల పార్కింగ్



రహదారిపై మూడు వరుసల్లో వాహనాలు



ఇతర సాధారణ వాహనదారులను అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది



రోడ్డు పక్కన నిలబడి అక్రమ పార్కింగ్ వేడుక చూస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

**జీహెచ్ఎంసీ రహదారినే పార్కింగ్ జోన్ గా వాడుకుంటున్న వైనం**

**ప్రశ్నించిన వాహనదారులపై ఓక్రిడ్జ్ సెక్యూరిటీ దబాయింపు**

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం: శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్**

ఈ కబురు, శేరిలింగంపల్లి :" 'అత్త సొమ్ము అల్లుడి దానం' అనే సామెత అందరూ వినే ఉంటారు.. ఈ సామెత ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ కు సరిగ్గా సరిపోతుందేమో.. ఎందుకంటే.. ఓక్రిడ్జ్ స్కూల్ ముందున్న రహదారి ప్రభుత్వానిది.. రహదారిని నిర్మించింది జీహెచ్ఎంసీ... వెచ్చించిన నిధులు ప్రజల ముక్కుపిండి వసూలు చేసిన పన్నుల సొమ్ము.. కానీ రహదారిని వాడుకుంటుంది మాత్రం ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్.. స్కూల్ కు వచ్చే బడాబాబుల పిల్లల కార్లకు పార్కింగ్ జోన్ గా జీహెచ్ఎంసీ రహదారిని మార్చింది... ఇదేమిటని ప్రశ్నిస్తే స్కూల్ సెక్యూరిటీ సిబ్బంది దబాయింపులకు దిగుతున్నారు..."

ఖాజాగూడ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం తీరు మారలేదు. జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినా డోంట్ కేర్ అంటూ రహదారినే తమ పార్కింగ్ జోన్ గా మార్చుకుంటున్నారు. ప్రధానమైన ఈ దారిలో వచ్చే వాహనాలను అడ్డుకొని మరీ బడాబాబుల కార్ల పార్కింగ్ కు వేదికగా చేస్తున్నారు. అడ్డుకోవలసిన ట్రాఫిక్ పోలీసులు సైతం చేష్టలుడిగి చూస్తుండడం, సంఘటన స్థలంలో ఉండికూడా అక్రమ పార్కింగ్ ను అడ్డుకోకపోవడం శోచనీయం.

గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని ఖాజాగూడలో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉంది. దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంలో నగరంలోనే హైఫై స్కూల్ గా ఓక్రిడ్జ్ కు పేరుంది. ఈ స్కూల్ లో చదువుతున్న వారంతా బడాబాబుల పిల్లలే కాగా కేవలం ఎల్ కేజికే అక్షరాల 5 లక్షల ఫీజు గుంజుతారనే ప్రచారం ఉంది. ఇంతటి ప్రతిష్టాత్మక స్కూల్, లక్షలకు లక్షలు ఫీజులు, డొనేషన్లు వసూలు చేసే స్కూల్ పార్కింగ్ కోసం సామాన్యులను వేధించడం అలవాటుగా చేసుకుంది. బడాబాబుల పిల్లలు చదివే స్కూల్ కావడంతో రోజు వందల సంఖ్యలో కార్లు స్కూల్ కు వస్తుంటాయి. స్కూల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో కొన్ని స్కూల్ బస్సులు పార్కింగ్ చేస్తుండగా, మిగిలిన బస్సులు, కార్లకు ముందున్న రోడ్డే పార్కింగ్ అడ్డాగా మారింది. ఖాజాగూడ చెరువు రోడ్డు నుంచి ఔటర్ ను కలిపే ప్రధాన లింకురోడ్డు కాగా ఈ దారిలో ప్రతినిత్యం సాఫ్ట్వేర్ ఉద్యోగులు, స్థానికులు ప్రయాణాలు సాగిస్తుంటారు. 30 అడుగుల రోడ్డులో ఓక్రిడ్జ్ స్కూల్ కు వచ్చే కార్లనే మూడు వరుసలుగా పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ఈ దారిలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ ప్రయాణికులను అడ్డుకొని మరీ ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది రోడ్డును బ్లాక్ చేసి వాహనాల పార్కింగ్ చేపడుతున్నారు. ఓక్రిడ్జ్ యాజమాన్యం తీరుపై ప్రశ్నిస్తే ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది దబాయించడంతో పాటు బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. స్థానికుల పిర్యాదులతో రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఆగస్టు 14వ తేదీన ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ కు నోటీసు జారీ చేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, రహదారిపై పార్కింగ్ ను నిలిపివేయాలని సూచించింది. కానీ ఓక్రిడ్జ్ తీరు మాత్రం మారలేదు. జీహెచ్ఎంసీ నోటీసులను సైతం లెక్క చేయకుండా స్కూల్ ముందున్న రోడ్డును పార్కింగ్ జోన్ గా వాడుకుంటున్నారు. రహదారిపై అక్రమ పార్కింగ్ ను అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు సైతం స్పందించడం లేదు. ఓవైపు రహదారిని ఆక్రమించి ఓక్రిడ్జ్ స్కూల్ వాహనాల పార్కింగ్ చేపట్టగా, మంగళవారం ఇదే దారి మలుపులో రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రహదారి మీద వచ్చే వాహనాలను ఆపి పెండింగ్ చలానాలు వసూలు చేస్తుండడం విస్తుగొలుపుతుంది.

**చర్యలు తీసుకుంటాం : శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్**

కాగా ఓక్రిడ్జ్ స్కూల్ రహదారిని ఆక్రమించి అక్రమ పార్కింగ్ చేపడుతున్న విషయమై శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్ ప్రశాంతిని వివరణ కోరగా.. ఓక్రిడ్జ్ స్కూల్ అక్రమ పార్కింగ్ మీద పిర్యాదులు రావడంతో తాము ఆగస్టు 14వ తేదీనే నోటీసులు జారీ చేశామని తెలిపారు. దీనిపై ఓక్రిడ్జ్ స్కూల్ సమాధానం ఇస్తూ తమకు పార్కింగ్ వసతి లేని కారణంగా రహదారి మీద పార్కింగ్ కు అనుమతి ఇవ్వాలని కోరిందని, కానీ తాము ఒప్పుకోలేదన్నారు. స్కూల్ బస్సులు, స్కూల్ కు వచ్చే వాహనాలు తప్పని సరిగా పార్కింగ్ స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలని, రహదారిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. ఓక్రిడ్జ్ అక్రమ పార్కింగ్ మీద చర్యలు తీసుకొని, సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

# అనుమానస్పదంగా చిన్నపిల్లల వద్ద తిరుగుతున్న మహిళ



గచ్చిబౌలి పోలీసుల అదుపులో అనుమానిత మహిళ

**కిడ్నాపర్ అనే అనుమానంతో చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు**

**మతిస్థిమితం లేనట్టుగా ప్రవర్తిస్తుండడంతో హోమ్ కు తరలింపు**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : అనుమానస్పదంగా చిన్నపిల్లల వద్ద తిరుగుతున్న మహిళను గచ్చిబౌలిలో స్థానికులు పట్టుకున్నారు. మహిళ తన వివరాలను తెలుపకపోవడంతో చిన్నపిల్లల కిడ్నాపర్ గా భావించిన స్థానికులు అనుమానస్పద మహిళను చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసు విచారణలో మహిళ తాను ఎక్కడ ఉంటుంది చెప్పకపోవడం, మతిస్థిమితం లేనట్లు ప్రవర్తిస్తుండడంతో రెస్క్యూ హోంకు తరలించారు. గచ్చిబౌలిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మజీద్ బండ సమీపంలోని నిర్మాణంలో ఉన్న అనసూయ హిల్స్ లేబర్ క్యాంప్ కు ఓ అనుమానిత మహిళ వచ్చింది. అక్కడి చిన్నపిల్లల వద్ద కలియ తిరుగుతూ, వారి పక్కనే ఉండసాగింది. దీంతో స్థానికులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా సరైన సమాదానం చెప్పలేదు. దీంతో చిన్న పిల్లల కిడ్నాప్ గా భావించిన స్థానికులు మహిళను చితకబాది డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. గతకొన్ని రోజుల క్రితమే లేబర్ క్యాంపుల వద్ద ఒంటరిగా ఉండే చిన్నారులను కిడ్నాప్ చేస్తున్న ముఠాను చందానగర్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు ముందు జాగ్రత్తగా పోలీసులకు అప్పగించగా, గచ్చిబౌలి పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించి మహిళను విచారించారు.

విచారణలో తన పేరు పూనమ్(35) అని, మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు చెప్పగా, తన వద్ద సరైన గుర్తింపు కార్డు లభించలేదు. మరోవైపు మహిళా పోలీసులు సదరు మహిళను సమీప ప్రాంతాలకు తీసుకువెళ్లినా తాను ఎక్కడ ఉండేది వెల్లడించలేదు. మతిస్థిమితం లేనట్లుగా వ్యవహరిస్తుండడంతో పోలీసులు అనుమానిత మహిళను హోంకు తరలించారు. మహిళ పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, మహిళతో పాటు మరెవరైనా వచ్చారా అనే కోణంలో స్థానిక సిసి కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీ భూకబ్జాలపై హైడ్రా ఫోకస్



హైడ్రా కాపాడిన కోట్ల విలువైన పార్కు స్థలం

**600 గజాల స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ చేసిన హైడ్రా**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో మిగులు భూముల కబ్జాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. టీఎన్జీవో, సెక్రటేరియట్, హైకోర్టు ఉద్యోగుల గృహ సముదాయంతో ఏర్పాటు చేసిన గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో మిగులు భూములను సొసైటీ నిర్వాహకులే కబ్జా చేసి విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో హైడ్రా పూర్తిస్థాయి విచారణ చేపడుతుంది. ఇందులో భాగంగా సెక్రటేరియట్ లే అవుట్ లో పార్కు స్థలంగా ఉన్న 600 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా సదరు స్థలం చుట్టూ మంగళవారం ఫెన్సింగ్ వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 600 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు 11 కోట్ల రూపాయల వరకూ ఉంటుందని అంచనా. తెలంగాణ సెక్రటేరియట్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీకి చెందిన 24 ఎకరాల లే ఔట్ లో రెండు పార్కులను హైడ్రా మంగళవారం కాపాడి.. చుట్టూ ఫెన్సింగ్ వేసింది. హెచ్ఎండీఏ అనుమతి పొందిన ఈ లే ఔట్ లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను సొసైటీ నిర్వాహకులు అమ్మినట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పార్కుల స్థలాలుగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. కాగా ఇప్పటికే చేతులు మారిన స్థలాల అమ్మకం కొనుగోళ్లపై పూర్తిస్థాయి విచారణ చేపడుతుంది. టీఎన్జీవో కాలనీలోని విలువైన మిగులు స్థలాల కబ్జాల వెనుక ఎవరున్నారని విషయంపై హైడ్రా అధికారులు ఆరా తీస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.



స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# కొండాపూర్ లో బిజెపి సేవాపక్షం సమావేశం




సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

**సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వరకు తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాలు**

ఈ కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్ డివిజన్ మజీద్ బండలో గల బిజెపి కార్యాలయంలో మంగళవారం బిజెపి సేవా పక్షం సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సేవాపక్షం రంగారెడ్డి జిల్లా కన్వీనర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గంగల రాధాక్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాల సన్నాహక సమావేశంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవాపక్షం ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సేవాపక్షం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త తప్పనిసరిగా పాల్గొని, బిజెపి సిద్ధాంతాలను ప్రజలతో మమేకం చేయాలని పిలుపునిచ్చారు. సేవే మంత్రం సమాజ అభివృద్దే లక్ష్యం అనే సిద్ధాంతంతో ముందుకు సాగాలని సూచించారు. గంగల రాధాక్రిష్ణ యాదవ్ మాట్లాడుతూ సేవా పక్షం కేవలం పార్టీ కార్యక్రమం కాదని, సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు, ప్రతి కుటుంబాన్ని చేరేందుకు ఒక వేదిక అని అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా సెప్టెంబరు 17వ తేదీన అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీన విశ్వకర్మ జయంతి సందర్భంగా బహుజన బంధు కార్యక్రమం, 19వ తేదీన స్వచ్ఛ భారత్, 21వ తేదీన యోగా శిబిరాలు, నియోజకవర్గంలో పాదయాత్రలు, 25వ తేదీన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ్ జయంతి, పోటీలు, డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందన్నారు. 27వ తేదీన విద్యార్థులకు బహిరంగ సభలు, 28వ తేదీన శ్రీమతి భారతమాత వీరమాతల సత్కారం, అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా పాదయాత్రలు, శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, బోల్గాం యశ్పాల్ గౌడ్, ఉపాధ్యక్షులు మూల ఆనీల్ గౌడ్, స్రవంతి, కార్యదర్శులు మణిభూషణ చారి, మాణిక్ రావు, దుర్గాప్రసాద్, కోశాధికారి కృష్ణంరాజు, సేవాపక్షం జిల్లా కోకన్వినర్ కుమార్ యాదవ్ తో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

# గ్రూప్1పై అప్పీలుకెళ్దామా?



ఈ-కబురు, గ్రూప్-1 పరీక్షలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో.. పరీక్షల విషయం మళ్లీ మొదటికొచ్చింది. సమాధానపత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని.. లేనిపక్షంలో పరీక్షలను రద్దుచేస్తామని హైకోర్టు వ్యాఖ్యానించడంతోపాటు.. టీజీపీఎస్సీ పనితీరును తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యచరణపై మంగళవారం టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు. పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థుల అన్ని అనుమానాలను నివృత్తి చేశామని కమిషన్ చెబుతోంది. కొందరు రాజకీయ దురుద్దేశంతో దీన్ని వివాదాస్పదం చేస్తున్నారని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో డివిజన్ బెంచ్‌కి అప్పీలు చేయాలని కమిషన్ నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన విడుదలయ్యే అవకాశాలున్నాయి. డివిజన్ బెంచ్‌లో తన వాదనను మరింత సమర్థంగా వినిపించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. మరోవైపు ఇప్పటికే విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసుకుని, నియామక పత్రాల కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులు సైతం హైకోర్టు తీర్పును సవాల్ చేయాలని నిర్ణయించారు. వారు కూడా డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయనున్నారు. అక్కడా న్యాయం జరగకపోతే.. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు.

## చిన్న కారుపై.. భారీ తగ్గింపు:
### ఏకంగా రూ.3 లక్షలు



ప్రముఖ వాహన తయారీ సంస్థ "మినీ" ఇప్పుడు భారతదేశంలో మినీ కూపర్ ధరలను తగ్గించింది. కేంద్రం కొత్తగా ప్రకటయించిన జీఎస్టీ 2.0 సంస్కరణ తరువాత కంపెనీ ధరలు వెల్లడించింది. సవరించిన కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అందుబాటులో ఉంటాయి.

మినీ కూపర్ ప్రస్తుతం భారతీయ విఫణిలో.. నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంది. అవి ఎసెన్షియల్, క్లాసిక్, ఫేవర్డ్, జేసీడబ్ల్యు. కంపెనీ ఇప్పుడు ఈ వేరియంట్స్ ధరలను రూ. 2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు తగ్గించింది. ఇది కొత్త మినీ కార్ల కొనుగోలుదారులకు ప్రయోజనకారిగా ఉంటుంది.

**తగ్గిన ధరలు**

ఎసెన్షియల్: రూ. 2,50,000 తగ్గింది - (కొత్త ధర రూ. 43,70,000)

క్లాసిక్: రూ. 2,75,000 తగ్గింది - (కొత్త ధర రూ. 49,20,000)

ఫేవర్డ్: రూ. 3,00,000 తగ్గింది - (కొత్త ధర రూ. 52,00,000)

జేసీడబ్ల్యు: రూ. 3,00,000 తగ్గింది - (కొత్త ధర రూ. 54,50,000)

## జియో కొత్త టెక్నాలజీ:
# టెన్షన్ లేకుండా 5జీ నెట్.. కాలింగ్

నియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రిలయన్స్ జియో తన సేవలను నిరంతరం అప్ డేట్ చేస్తూనే ఉంది. కాల్స్ చేయడంలో ఉన్న సమస్యలను అధిగమించేందుకు దేశవ్యాప్తంగా వాయిస్ ఓవర్ న్యూ రేడియో అనే ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టింది. ఈ జియో సర్వీస్ వారి సొంతంగా పనిచేస్తుంది, అంటే స్వదేశీ 5జీ స్వతంత్ర కోర్. ఈ సేవతో ప్రతి 5జీ ఫోన్ మినీ స్టూడియోగా మారుతుందని జియో పేర్కొంది.

ఇప్పటి వరకు చాలా టెలికాం కంపెనీలు 5జీ ఇంటర్నెట్ ను అందిస్తున్నప్పటికీ, కాలింగ్ కోసం బ్యాక్ ఎండ్ లో 4జీ నెట్ వర్క్ పైనే ఆధారపడేవి. వీవోఎన్ఆర్ ఈ అంతరాన్ని పూరిస్తుంది. వినియోగదారులకు పూర్తిగా 5జీ కోర్ ఆధారంగా కాలింగ్ అనుభవాన్ని ఇస్తుంది.

వీవోఎన్ఆర్ అంటే ఏమిటి?

జియో కొత్త టెక్నాలజీ వోఎల్టీఈ వంటి పాత వ్యవస్థల స్థానంలో వీఓఎన్ఆర్ భర్తీ చేస్తోంది. ఈ 5జీ ఫోన్ నేటివ్ వాయిస్ కాల్స్ ను అందిస్తుంది. ఈ టెక్నాలజీ కారణంగా, కాల్ త్వరగా కనెక్ట్ అవుతుంది. దీని రాకతో, కాల్ డ్రాప్‌లు, వాయిస్ బ్రేక్ వంటి సమస్యలు కూడా దాదాపుగా తొలగిపోతాయి. దీంతో యూజర్ల ఫోన్ బ్యాటరీని కూడా ఆదా చేస్తుందని జియో చెబుతోంది. దీనితో పాటు కాల్ రూటింగ్, నెట్ వర్క్ ఎఫిషియెన్సీ మెరుగ్గా ఉంటుంది.

జియో తన వీఓఎన్ఆర్ రోల్ అవుట్ పూర్తిగా స్వదేశీ టెక్నాలజీ స్టాక్ పై ఆధారపడి ఉందని పేర్కొంది. దీని అర్థం బ్యాక్ ఎండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుండి సర్వీస్ మేనేజ్మెంట్ వరకు ప్రతిదీ భారతీయ ఇంజనీర్లు, భాగస్వాముల సహాయంతో నిర్మించినదే. ఇది సాంకేతిక స్వాతంత్ర్యం వైపు ఒక పెద్ద అడుగు మాత్రమే కాదు, భవిష్యత్తులో భారతదేశాన్ని డిజిటల్ పరిష్కారాలను ఎగుమతి చేసే దేశంగా మార్చగలదు.

వీవోఎన్ఆర్ ప్రయోజనాలు

ఫాస్ట్ కాల్ కనెక్షన్ ఫోన్ చేసిన కొన్ని సెకండ్లలోనే కాల్ కనెక్ట్ అవుతుంది.

మెరుగైన వాయిస్ క్వాలిటీ హెచ్‌డీ+సౌండ్ సంభాషణను మరింత స్పష్టంగా చేస్తుంది.

కాల్ డ్రాప్ లు తగ్గడం నెట్ వర్క్ స్విచింగ్ వల్ల ఎలాంటి సమస్య ఉండదు.

బ్యాటరీ సేవింగ్: ఫోన్ 4జీ, 5జీ మధ్య పదే పదే షిఫ్ట్ అవ్వాల్సిన అవసరం లేదు.

మెరుగైన ఇంటర్నెట్ + కాలింగ్ కాల్ లో మాట్లాడేటప్పుడు కూడా ఇంటర్నెట్ బ్రౌజింగ్ 5జీ వేగంతో కొనసాగుతుంది.




# లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు




అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల నడుమ మంగళవారం మన సూచీలు లాభాల్లో కదలాడుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత విధించొచ్చన్న అంచనాలు అందుకు దోహదం చేస్తున్నాయి. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 320 పాయింట్ల లాభంతో 81,107 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 86 పాయింట్లు ఎగబాకి, 24,859 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 14 పైసలు పెరిగి, 87.95 గా ఉంది.

ఏ షేర్లు ఎలా..?

నిఫ్టీ సూచీలో టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, కొటక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. టైటాన్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టాల్లో కదలాడుతున్నాయి. లోహాల ఫ్యూచర్స్ ట్రేడింగ్ జరిగే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ధర రికార్డు స్థాయిని తాకింది. రూ.1.10 లక్షలకు చేరింది. నిన్న అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జపాన్ ఆటో టారిఫ్‌లను 27.5 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆసియాపసిఫిక్ మార్కెట్లు లాభాల్లో పయనిస్తున్నాయి.

# టయోటా కార్ల ధరల తగ్గింపు..
## ఫార్చ్యూనర్‌పై రూ.3.5 లక్షలు..




జీఎస్టీ తగ్గింపు, పరిహార సెస్ రద్దు వాహన కొనుగోలుదారులతో పాటు తయారీదారులకు భారీ ఉపశమనం కలిగించింది. ఇది కార్లు, ద్విచక్ర వాహనాలతో సహా అన్ని రకాల వాహనాల ధరలపైనా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఫలితంగా, వాహన తయారీ సంస్థలు తమ అన్ని మోడళ్ల సవరించిన ధరలను ప్రకటించడం ప్రారంభించాయి. తాజాగా జపాన్ ఆటో దిగ్గజం టయోటా తమ అన్ని కార్లపై ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చే రోజు అంటే సెప్టెంబర్ 22 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. సకాలంలో డెలివరీలు అందుకోవడానికి పండుగ సీజన్ ప్రారంభానికి ముందే వీలైనంత త్వరగా బుకింగ్‌లను కన్ఫర్మ్ చేసుకోవాలని కస్టమర్లను కోరింది. కొన్ని ప్రీమియం మోడళ్ల తగ్గింపు ధరలను కంపెనీ ప్రకటించింది. తాజా అప్ డేట్ ప్రకారం. అత్యధికంగా ఫార్చ్యూనర్ ధర రూ .3.49 లక్షల వరకు తగ్గుతుంది. దీని తరువాత మరో ప్రీమియం వేరియంట్ లెజెండర్ ధర రూ .3.34 లక్షల వరకు తగ్గనుంది. ఫార్చ్యూనర్, లెజెండర్ ధరలు వరుసగా రూ .36.05 లక్షలు, రూ .44.51 లక్షలు (రెండూ ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి. తమ లైనప్ లోని ప్రతి మోడల్ ప్రతి వేరియంట్ సవరించిన ధరలను టయోటా త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. సవరించిన జీఎస్టీ నిర్మాణం అన్ని విభాగాలలో కార్ల ధరలను తగ్గించింది. 4 మీటర్ల లోపు పరిమాణం ఉన్న చిన్న కార్లపై (1,200సీసీ వరకు పెట్రోల్ ఇంజిన్లు లేదా 1,500 సీసీ వరకు డీజిల్ ఇంజిన్లు) ఇకపై 28% బదులుగా 18% జీఎస్టీ వర్తిస్తుంది. దీంతో వీటి ధరలు 513% తగ్గుతున్నాయి. ఇక 4 మీటర్ల కంటే ఎక్కువ పరిమాణం, పెద్ద ఇంజిన్లు ఉన్న పెద్ద కార్లపై 28 శాతం జీఎస్టీకి బదులుగా 40 శాతం (ప్రత్యేక శ్లాబ్) జీఎస్టీ విధిస్తారు. అయితే సెస్ తొలగింపుతో వీటి ధరలు కూడా 310% తగ్గే అవకాశం ఉంది.

# అమెరికాతో
## దౌత్య బృందాలు చర్చిస్తున్నాయి
## నిర్మలా సీతారామన్



భారత ఉత్పత్తులపై సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా.. రానున్న రోజుల్లో మరిన్ని సుంకాలు తప్పవనే హెచ్చరికలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన భారత్.. వాణిజ్య చర్చల కోసం అమెరికాతో మన దౌత్య బృందాలు చర్చలు జరుపుతున్నాయని పేర్కొంది. ఓ జాతీయ వార్తాఛానల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. జీఎస్టీ సంస్కరణలకు అమెరికా టారిఫ్‌లతో సంబంధం లేదన్నారు."చర్చలకు భారత్ ద్వారాలు తెరిచే ఉంచింది. దౌత్య బృందాలు అమెరికాతో సంప్రదింపులు కొనసాగిస్తున్నాయి. వాణిజ్య చర్చలు కొనసాగే అవకాశం ఉంది. ఇటువైపు నుంచి.. ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలిగించడం లేదు" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. భారత్ దారికి రావాల్సిందే.. మళ్లీ నోరు పారేసుకున్న ట్రంప్ వాణిజ్య సలహాదారు

అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా జీఎస్టీ సంస్కరణలు తీసుకురాలేదని, గత ఏడాదికిపైగా చర్చల అనంతరమే తాజా నిర్ణయాలు తీసుకున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. గత బడ్జెట్‌లో చేసిన ఆదాయపన్ను ప్రకటనతో పాటు జీఎస్టీ సంస్కరణలకు ప్రణాళికను రూపొందించామన్నారు.

ద్వైపాక్షిక వాణిజ్య చర్చలపై ఇరు దేశాలు సంప్రదింపులు కొనసాగుతున్న వేళ కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటివరకు ఐదు దఫాల్లో చర్చలు పూర్తయ్యాయి. ఆరో విడతలో భాగంగా గత నెలలో అమెరికా బృందాలు భారత్‌కు రావాల్సి ఉన్నప్పటికీ.. ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో పర్యటనను వాయిదా వేసుకున్నాయి.

# భారత్‌లో 'స్టార్‌గేట్'..
## దిగ్గజ డేటా సంస్థలతో ఓపెన్ ఏఐ చర్చలు..!



అమెరికా కు చెందిన కృత్రిమ మేధ సంస్థ ఓపెన్ ఏఐ భారత్ లోని డేటా సెంటర్ల కంపెనీలతో చర్చలు జరుపుతోంది. వీటిల్లో సిఫి టెక్నాలజీస్, యట్టా డేటా సర్వీసెస్, ఈ2ఈ నెట్‌వర్క్స్, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా చేపట్టిన గ్లోబల్ జాయింట్ వెంచర్ స్టార్‌గేట్‌ను భారత్ కు తీసుకురావడంలో భాగంగా ఇవి జరుగుతున్నాయి. మరోవైపు ఓపెన్ ఏఐ గత ఆరు నెలలుగా చమురు, టెలికాం రంగ సంస్థ రిలయన్స్‌తో కూడా చర్చలు జరుపుతోంది. ఈవిషయాన్ని ఆ సంస్థే వెల్లడించింది. ఇప్పటికే రిలయన్స్ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను జామ్‌నగర్‌లో నిర్మించేందుకు సిద్ధమైంది. మరోవైపు రిలయన్స్, ఓపెన్ ఏఐ ఎటువంటి బహిరంగ ప్రకటన చేయలేదు. ప్రస్తుతం చర్చలు డేటా కంపెనీల ఏర్పాటు, వాటికి అవసరమైన విద్యుత్తు, ఇతర సరఫరాల లభ్యత వంటి వాటిపై కూడా చర్చలు జరుగుతున్నాయి. స్టార్‌గేట్ ప్రాజెక్టును తమ దేశానికి తీసుకురావాలని కొన్నాళ్ల క్రితం భారత ప్రభుత్వం ఓపెన్ ఏఐ ను కోరింది. భారతీయుల డేటాను స్థానికంగా ఉంచేటట్లు చేయడమే దీని లక్ష్యం. ఈనేపథ్యంలో తాజాగా చర్చలు మొదలయ్యాయి. భారత ప్రభుత్వం కూడా దీనిలో కొన్ని బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడి పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారతదేశం ఓపెన్ ఏఐకు కీలక మార్కెట్‌గా ఎదుగుతోంది. భవిష్యత్తులో దానికి అత్యధిక ఆదాయం కూడా ఇక్కడినుంచే లభించనుంది. ఈ క్రమంలో ఆ కంపెనీలో భాగమైన స్టార్‌గేట్ ప్రాజెక్టులో చెప్పుకోదగిన వాటాను భారత్‌లో పెట్టాల్సిఉంటుందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఆ సంస్థ కూడా ప్రజల డేటాను స్టోర్ చేయడం, ప్రాసెస్ చేయడం లాంటివి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ఏడబ్ల్యూఎస్ వంటి కంపెనీలు భారత్‌లో భారీ డేటా సెంటర్లను నిర్వహిస్తున్నాయి. వీటిల్లో కొన్ని విస్తరిస్తున్నాయి కూడా. దీంతో లేటెన్సీ తగ్గడంతోపాటు.. వారి సేవల నాణ్యత కూడా మెరుగుపడుతోంది. గత నెల ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ మాట్లాడుతూ అమెరికా తర్వాత భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అని పేర్కొన్నారు. ఇక్కడ తమ కంపెనీలు వేగంగా ఎదుగుతాయని చెప్పారు. ఇప్పటికే కంపెనీ న్యూఢిల్లీలో సరికొత్త ఆఫీస్‌ను ఏర్పాటుచేస్తోంది. స్థానిక నియామకాలను కూడా మొదలుపెట్టింది. ధరలను భారత కరెన్సీల్లోకి మార్చి సబ్‌స్క్రైబర్లను పెంచుకొంటోంది. ఓపెన్ కీలక ఆసియా దేశాల్లో వినియోగదారుల డేటాను అక్కడే స్టోర్ చేసే ప్రక్రియను మే నెలలోనే మొదలుపెట్టింది.

## బంగారం ఆల్‌టైమ్ రికార్డ్ ధర:
# ఒక్కసారిగా పెరగడానికి కారణాలు

దేశంలో బంగారం ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధర మంగళవారం 10 గ్రాములకు రూ.723 పెరిగి రూ.1,10,312కు చేరుకుంది. ఎంసీఎక్స్ లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ .723 లేదా 0.65% పెరిగి రూ .1,10,312 వద్ద కొత్త గరిష్టానికి చేరుకుంది. అంతర్జాతీయంగా డిసెంబర్ కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్స్‌కు 3,698.02 డాలర్ల కొత్త ఆల్‌టైమ్ గరిష్టానికి పెరిగింది. స్పాట్ గోల్డ్ కూడా ఔన్స్‌కు 3,658.38 డాలర్ల రికార్డు స్థాయికి పెరిగింది. బంగారం ఒక్కసారిగా ఇంతలా పెరగడానికి నిపుణులు పలు కారణాలను పేర్కొంటున్నారు. బంగారం ధర ఆకాశాన్ని తాకడానికి ముఖ్య కారణాలు

**అమెరికా ఫెడ్ రేటు తగ్గింపు ఆశలు**

ట్రేడర్లు ఫెడ్ రేట్ల తగ్గింపుపై మరింత ఆశాభావంతో ఉన్నారు. మనీ మార్కెట్లు ఇప్పటికే 25బేసిస్ పాయింట్ల రేటు తగ్గింపును పూర్తిగా అంచనా వేశాయి. అంతేకాక సీఎంఈ ఫెడ్‌వాచ్ టూల్ ప్రకారం.. 50బేసిస్ పాయింట్ల మేర తగ్గింపు అవకాశాలు కూడా దాదాపు 12% వరకు పెరిగినట్లు తెలుస్తోంది.

**బలహీనమైన అమెరికన్ డాలర్**

జపనీస్ యెన్ తో పోలిస్తే డాలర్ 0.2 శాతం తగ్గి 147.21 వద్ద ఉండగా, బ్రిటీష్ పౌండ్ 0.1% పెరిగి 1.3558 డాలర్లకు చేరుకుంది. జూలై 24 నుండి క్లుప్తంగా గరిష్ట స్థాయిని తాకిన తరువాత యూరో 1.1752 డాలర్లకు పడిపోయింది.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం**

ఉక్రెయిన్ పై మాస్కో ప్రతీకార దాడి తరువాత రష్యాపై అమెరికా అదనపు ఆంక్షల సంభావ్యత సురక్షితస్వర్గధామ ఆస్తుల డిమాండ్ ను మరింత పెంచిందని కమోడిటీస్ మార్కెట్ నిపుణులు గుర్తించారు.

సుంకం మినహాయింపులునికెల్, బంగారం, వివిధ లోహాలు, అలాగే ఫార్మాస్యూటికల్ కాంపౌండ్స్, రసాయనాలతో సహా పారిశ్రామిక ఎగుమతులపై ఒప్పందాలను కుదుర్చుకునే వాణిజ్య భాగస్వాములకు సెప్టెంబర్ 8 నుంచి సుంకం మినహాయింపులను మంజూరు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై సంతకం చేశారు.



# యాక్సిడెంట్ వార్తలపై స్పందించిన కాజల్.. ఎక్స్ వేదికగా పోస్ట్



అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్‌కు యాక్సిడెంట్ అయిందని పరిస్థితి విషమంగా ఉందంటూ సోమవారం సోషల్ మీడియాలో కొన్ని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిపై కాజల్ స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నానని ఆ వార్తలన్నీ రూమర్స్ మాత్రమేనని చెప్పారు.

కాజల్‌కు యాక్సిడెంట్ అయిందనే వార్తలు సోమవారం సాయంత్రం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఆందోళన చెందిన అభిమానులు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. దీనిపై కాజల్ స్పందిస్తూ ఈ వార్తలను ఖండించారు. “నేను ప్రమాదంలో ఉన్నానని (ఇక లేనని కూడా!) వస్తోన్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. నిజం చెప్పాలంటే అవి చూసి నేను నవ్వుకున్నాను. ఎందుకంటే ఇంతకుమించిన ఫన్నీ న్యూస్ ఉండదు. అవన్నీ పూర్తి అవాస్తవం. దేవుడి దయ వల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దు, ప్రచారం కూడా చేయొద్దని మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను. ఇలాంటి ఫేక్ న్యూస్‌లను షేర్ చేసే బదులు ఏవైనా నిజమైన వార్తలను నలుగురితో పంచుకోండి” అంటూ నోట్ విడుదల చేశారు.

తడిసి మోపెడైంది.. రూ.90 కోట్లు పెరిగిన బడ్జెట్.. అప్పు చేసిన బోనీ కపూర్

ఇక సినిమాల విషయానికొస్తే.. కాజల్ చివరిసారిగా ‘కన్నప్ప’లో నటించారు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో వచ్చిన ఆ చిత్రంలో కాజల్ పార్వతీదేవిగా కనిపించారు. ప్రస్తుతం ‘ఇండియన్ 3’లో నటిస్తున్నారు. అలాగే ‘రామాయణ’లోనూ ఈ చందమామ నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి

# క్రిష్ 4' బడ్జెట్ ఓ కొలిక్కి వచ్చింది..: రాకేశ్ రోషన్



బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ నటించిన చిత్రాల్లో ‘క్రిష్’ విశేష ఆదరణను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా ‘క్రిష్ 3’ తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. ఈ ఫ్రాంచైజీలోనే ‘క్రిష్ 4’ రానుంది. దీనికి హృతిక్ రోషన్ దర్శకత్వం వహించనున్నారు. అయితే భారీ బడ్జెట్ కారణంగా దీని షూటింగ్‌ను ప్రారంభించలేకపోతున్నట్లు హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. తాజాగా దీనిపై ఆయన అప్‌డేట్ ఇచ్చారు. బడ్జెట్‌పై అవగాహన వచ్చిందన్నారు.

తాము ఎంత ప్రయత్నించినా ఈ సినిమాకు బడ్జెట్ సమకూరడం లేదని అందుకే ఇది ఆలస్యమవుతోందని గతంలో రాకేశ్ తెలిపారు. నాలుగో భాగాన్ని మరింత గ్రాండ్‌గా తీయాలని ఒకవేళ బడ్జెట్ తగ్గించాలని చూస్తే.. ఈ చిత్రం ఓ సాధారణ కథలా అయిపోతుందని చెప్పారు. తాజాగా దీనిపై ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. “స్క్రిప్ట్ రాయడానికి పెద్దగా సమయం పట్టదు. కానీ, బడ్జెట్ విషయంలో ఒత్తిడి వల్లే ఇన్ని రోజులు ముందుకు వెళ్లలేకపోయాం. ఇప్పుడు ఈ సినిమాకు ఎంత బడ్జెట్ అవుతుంది అనే దానిపై మాకు అవగాహన వచ్చింది. ప్రస్తుతం దీని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రీ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం పట్టొచ్చు. వచ్చే ఏడాదిలో చిత్రీకరణను ప్రారంభిస్తాం. 2027లో దీన్ని మీ ముందుకు తీసుకురావాలని భావిస్తున్నాం” అని తెలిపారు.

నా ఫొటోలు వాడొద్దు.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఐశ్వర్యారాయ్

‘క్రిష్’ సిరీస్ చిత్రాలకు దర్శకత్వం వహించిన రాకేశ్ రోషన్ నాలుగో భాగానికి కూడా తెరకెక్కించనున్నారని గతంలో వార్తలు వచ్చాయి. వాటికి చెక్ పెడుతూ తన కుమారుడు హృతిక్ రోషన్ దర్శకత్వంలో ‘క్రిష్ 4’ వస్తుందని తెలిపారు. ఇక ఈ సిరీస్ చిత్రాలు వరుసగా 2003, 2006, 2013 సంవత్సరాల్లో విడుదలైన విషయం తెలిసిందే.

# నా ఫొటోలు వాడొద్దు.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఐశ్వ-ర్యారాయ్



ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ మంగళవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సంస్థలు/వ్యక్తులు ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.

కొందరు వ్యక్తులు ఐశ్వర్య ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉపయోగించుకుంటున్నారని ఆమె తరఫు న్యాయవాది సందీప్ సేథి కోర్టు (Delhi High దృష్టికి తీసుకొచ్చారు. ఆమె ఫొటోలను టీ షర్ట్‌లపై కూడా ముద్రించి అమ్ముతూ డబ్బులు వసూలుచేస్తున్నారని వెల్లడించారు. అనుమతి లేకుండా ఆమె చిత్రాలను ఉపయోగించుకొనే అధికారం ఎవరికీ ఉండదన్నారు. ఏఐతో ఐశ్వర్య చిత్రాలను క్రియేట్ చేసి యూట్యూబ్ ఛానల్స్ వారు అసభ్యకరమైన వీడియోలు చేస్తున్నారని న్యాయస్థానంలో వాదించారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 15న జరగనుంది.

యాక్సిడెంట్ వార్తలపై స్పందించిన కాజల్.. ఎక్స్ వేదికగా పోస్ట్

ఇక గతంలో ఐశ్వర్య తన కుమార్తెపై వచ్చిన తప్పుడు కథనాల విషయంలోనూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆరాధ్య బచ్చన్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని, ‘ఇక లేరు’ అంటూ కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ప్రచారంపైనా ఆమె కోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రతి చిన్నారిని గౌరవంగా చూడాలని, పిల్లల ఆరోగ్యానికి సంబంధించి తప్పదోవ పట్టించే సమాచారం వ్యాప్తి చేయడాన్ని చట్టం సహించదని పేర్కొంది. వాటిని తొలగించాలని ఆదేశించింది.

# నన్నెందుకు శత్రువులా చూస్తున్నారు: మోహన్ లాల్



సోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఇటీవల ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే, ఆమె కంటే ముందు ఆ పదవిలో ఉన్న మోహన్‌లాల్ తాను రాజీనామా చేసేందుకు దారితీసిన పరిస్థితుల గురించి తాజాగా మాట్లాడారు. తనతో పాటు, తన కార్యనిర్వాహక కమిటీలోని ఇతర సభ్యులను చాలామంది శత్రువుల్లా చూస్తున్నారన్నారు.

“అధ్యక్షుడు అనేది కేవలం ఒక పదవి. ఏదైనా సమస్య వస్తే దానికి అధ్యక్షుడు ఒక్కడే కారణమా? చాలామంది నాపై శత్రుత్వం పెంచుకున్నారు. అలా అని అందరూ నన్ను ద్వేషించారని నేను చెప్పడం లేదు. ఏదేమైనా నన్ను శత్రువులా ఎందుకు చూస్తున్నారో ఇప్పటికీ అర్థంకావడం లేదు. నాతోపాటు రాజీనామా చేసిన ఇతర వ్యక్తులు తిరిగి కమిటీలోకి వస్తారా, లేదా అనేది పూర్తిగా వారి నిర్ణయం. అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్‌ను ఎన్నుకోవడం గొప్ప విషయం. ఎందుకంటే గతంలో మహిళలు చర్చించలేకపోయిన విషయాలు ఇప్పుడు వారు సంకోచం లేకుండా చర్చించుకోవచ్చు. ‘అమ్మ’కు సపోర్ట్ ఇవ్వడానికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటాను” అని తెలిపారు.

యాక్సిడెంట్ వార్తలపై స్పందించిన కాజల్.. ఎక్స్ వేదికగా పోస్ట్

ఇక అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్‌స్‌కు నాయకత్వం వహించడానికి యువకులు ఎందుకు ముందుకురావడం లేదనే ప్రశ్నకు మోహన్‌లాల్ సమాధానమిచ్చారు. ‘యువకులు ముందుకురావాలని మనం అనుకుంటే సరిపోదు. వారు బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. బహుశా వారికి అంత సహనం లేదేమో’ అని తెలిపారు. మలయాళ చిత్ర పరిశ్రమపై జస్టిస్ హేమ కమిటీ గతేడాది ఓ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ చిత్ర సీమలో పనిచేసే మహిళలు క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆ నివేదికలో హేమ కమిటీ పేర్కొంది. దీంతో అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులు ఉన్న మొత్తం పాలక మండలి తమ పదవుల నుంచి వైదొలిగింది.

# ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసిన కన్నడ సూపర్‌హిట్ మూవీ




కన్నడలో సూపర్ హిట్‌గా నిలిచి, తెలుగులోనూ విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది ‘సు ఫ్రమ్ సో’. ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా? అని సినీ ప్రియులు వేచి చూశారు. వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ మంగళవారం నుంచి ‘జియో హాట్‌స్టార్’ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడ, తెలుగు, మలయాళం భాషల్లో అందుబాటులోకి వచ్చింది. జేపీ తుమినాడ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

**సైమా సినీ పండగ.. ఉత్తమ నటుడు అల్లు అర్జున్.. ఉత్తమ చిత్రం ఏదంటే..?**

కథేంటంటే: కర్ణాటకలోని ధర్మస్థలి ప్రాంత సమీపంలో ఉన్న ఓ ఊరిలో జరిగే కథ ఇది. ఆ ఊళ్లో ఉండే అశోక్ (జె.పి. తుమినాడ్) ఓ పెళ్లి నుంచి తిరిగి వెళ్తూ.. తాను ప్రేమించిన అమ్మాయి ఇంటి దగ్గర ఆగుతాడు. సరిగ్గా అప్పుడే ఆ ఇంటి బాత్రూంలో నుంచి ఆ అమ్మాయి మాట వినిపించడంతో దొంగతనంగా ఆమెను చూసే ప్రయత్నం చేస్తాడు. అయితే, అశోక్‌ను గమనించిన ఇద్దరు వ్యక్తులు అతడిని పట్టుకోగా.. తనకు దయ్యం పట్టినట్లు డ్రామా ఆడి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. కానీ, తెల్లవారే సరికి అశోక్‌కు దయ్యం పట్టిందన్న విషయం ఊళ్లో వైరలైపోతుంది. అతనిలో ఉన్న ఆ దయ్యాన్ని వదిలించేందుకు ఊరి పెద్ద రవన్న (షానిల్ గౌతమ్) సిటీ నుంచి కరుణాజీ స్వామీజీ (రాజ్ బి శెట్టి)ని తీసుకొస్తాడు. నిజంగానే అశోక్‌ని దయ్యం ఆవహించిందా? దాన్ని కరుణాజీ వదిలించాడా? దయ్యం పట్టినట్లు చేసిన హంగామా వల్ల ఊరంతా ఎలా ఇబ్బంది పడింది? అన్నదే కథ.

# జనాల్లేరు, సౌండ్ లేదు.. నా పెళ్లి అయిపోయింది





మరో హీరోయిన్ పెళ్లి చేసుకుంది. కానీ ఎలాంటి ప్రకటన లాంటివి లేకుండా సీక్రెట్‌గా వివాహం చేసుకుని అందరికీ షాకిచ్చింది. 'జనాల్లేరు.. లైట్స్ లేవు.. సౌండ్ లేదు. ఫైనల్లీ మా పెళ్లి అయిపోయింది' అని మలయాళ నటి గ్రేస్ ఆంటోని పోస్ట్ పెట్టింది. ఈ క్రమంలోనే తోటి హీరోహీరోయిన్లు అందరూ కొత్త పెళ్లికూతురికి శుభాకాంక్షలు చెబుతున్నారు.
2016 నుంచి ఇండస్ట్రీలో ఉన్న గ్రేస్ ఆంటోని.. కుంబళంగి నైట్స్, నునక్కుళి, పరంతు పో, రోర్చా తదితరులు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా వచ్చిన తమిళ చిత్రం 'పరంతు పో'లో ఈమెనే హీరోయిన్. అయితే మలయాళ మూవీస్ ఓటీటీల్లో చూసే తెలుగు ప్రేక్షకులకు ఈమె కాస్త పరిచయమే.ఇప్పుడు సడన్‌గా తను పెళ్లి చేసుకున్నానని చెప్పి గ్రేస్ బయటపెట్టింది. కానీ భర్త ఎవరు? ఇండస్ట్రీకి వ్యక్తి అనే విషయాల్ని మాత్రం రివీల్ చేయలేదు. ప్రస్తుతానికైతే రెండు ఫొటోలు అవి కూడా ఇద్దరి ముఖాలు కూడా కనిపించకుండా తీసుకున్న వాటిని మాత్రమే సోషల్ మీడియాలో షేర్ చేసింది. మరికొన్ని రోజుల్లో భర్త ఎవరు ఏంటి అనేది చెబుతుందేమో చూడాలి?

# సూర్యకుమార్ యాదవ్ పరుగులు రాబట్టాలి టీమ్ఇండియా మాజీ క్రికెటర్




సూర్యకుమార్ యాదవ్ ఐపీఎల్‌లో రాణించినప్పటికీ, అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగులు చేయడానికి కాస్త ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు అతడి కెప్టెన్సీకి వచ్చిన నష్టమేమీ లేదని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ అన్నాడు.
భారత జట్టు టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్‌గిల్‌కు ఆసియా కప్ స్క్వాడ్‌లో స్థానం కల్పించడంతో పాటు, వైస్ కెప్టెన్సీని అప్పగించారు. దీంతో భవిష్యత్తులో సూర్యకుమార్ యాదవ్ నుంచి పగ్గాలు గిల్‌కు వెళతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రస్తుతం వన్డే, టీ20, టెస్ట్ జట్టులకు వేర్వేరు కెప్టెన్లు ఉన్నారు. అన్ని జట్లకూ ఒకే సారథిగా గిల్‌ను నియమించే అవకాశాలున్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వసీం జాఫర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
సూర్యకుమార్ కొడితే.. ఆసియా కప్ మనదే!
'సూర్యకుమార్ గణాంకాలు పడిపోవడం (టీ20 కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాక ) ఆందోళన కలిగిస్తోంది. అతడు చివరగా ఆడిన కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లలో తక్కువ స్కోర్లకే పెవిలియన్‌కు చేరాడు. అతని షాట్ల ఎంపిక కూడా సరైన స్థాయిలో లేదు. కానీ, అతడు తన లోపాన్ని సవరించుకునే ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తోంది. ఐపీఎల్లో మాత్రం చక్కగా రాణించాడు' అని వసీం జాఫర్ అన్నాడు.
'సూర్యకుమార్ మైదానం నలుమూలలా షాట్లు ఆడుతున్నప్పుడు బౌలర్లు ఏమీ చేయలేరు. అతడు అంత ప్రమాదకరమైన బ్యాటర్. ఐపీఎల్‌లో రాణించినట్లుగానే, అంతర్జాతీయ క్రికెట్‌లోనూ పరుగులు రాబడతాడని ఆశిస్తున్నా' అని అతడు పేర్కొన్నాడు. అలాగే.. వైస్ కెప్టెన్‌గా గిల్‌ను నియమించినంత మాత్రాన సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ ప్రమాదంలో ఉన్నట్లు కాదని అతడు అన్నాడు. 'ప్రతి పర్యటన, ప్రతి సిరీస్‌లోనూ వైస్‌కెప్టెన్ ఉంటాడు. అంతమాత్రాన కెప్టెన్ ప్రమాదంలో ఉన్నాడని కాదు' అని వసీం జాఫర్ విశ్లేషించాడు.
సూర్యకుమార్ యాదవ్.. అంతర్జాతీయంగా చివరి అయిదు టీ20ల్లో కేవలం 28 పరుగులే చేశాడు. అందులో రెండు డకౌట్లూ ఉన్నాయి. 2, 0, 14, 12, 0... ఇవీ ఆఖరి అయిదు టీ20ల్లో అతడి స్కోర్లు. అయితే ఐపీఎల్‌లో మాత్రం ఏకంగా అయిదు హాఫ్‌సెంచరీలు చేశాడు. మొత్తంగా 717 పరుగులతో రెండో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా మ్యాచ్ విన్నర్లు: యూఏఈ బ్యాటర్




ప్రతిష్ఠాత్మకమైన ఆసియా కప్ మరికొన్ని గంటల్లోనే యూఏఈ వేదికగా ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్‌ల మధ్య జరగనుంది. సెప్టెంబర్ 10న రెండో మ్యాచ్‌లో టీమ్ఇండియా యూఏఈతో తలపడనుంది. భారత జట్టు ఇంతకుముందు కేవలం ఒక్కసారి మాత్రమే యూఏఈతో టీ20 మ్యాచ్ ఆడింది. అది కూడా 2016 ఆసియాకప్‌లో కావడం గమనార్హం. దాదాపు పది సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ ఇరుజట్లు మ్యాచ్ ఆడనున్నాయి. టీమ్ఇండియాకు సూర్యకుమార్ యాదవ్ , యూఏఈకి మహ్మద్ వసీమ్ , కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.
భారత జట్టు మొత్తం సూపర్‌స్టార్స్‌తో నిండి ఉందని, యూఏఈ ఓపెనర్ అలీషాన్ షరాఫు కొనియాడాడు. 'టీమ్ఇండియాలో అందరూ నాణ్యమైన ఆటగాళ్లే ఉన్నారు. ముఖ్యంగా జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య లాంటివారు మ్యాచ్ విన్నర్లు. వారు ఫలితాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారు. వారితో తలపడటం కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా.' అని షరాఫు అన్నాడు.

# గుకేశ్‌కు షాకిచ్చిన యువ గ్రాండ్‌మాస్టర్



ఫిడె గ్రాండ్ స్విస్ 2025లో భారత చెస్ స్టార్, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌ను అమెరికా గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా ఓడించాడు. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి చరిత్ర సృష్టించాడు. మిశ్రా 61 ఎత్తుగడలతో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కానీ తన ప్రదర్శనతో అతడు సంతృప్తి చెందలేదు!
సూర్యకుమార్ కొడితే.. ఆసియా కప్ మనదే!
'నేను గెలిచినప్పటికీ, ఈ టోర్నమెంట్ మునుపటి గేమ్‌స్‌లా అంత ఆహ్లాదకరంగా అనిపించలేదు. కానీ టోర్నమెంట్ నేను ఊహించిన దానికంటే బాగా జరుగుతోంది. నేను ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే, టోర్నమెంట్‌ను కూడా గెలిచే అవకాశం ఉంది. నిన్న కూడా నేను ప్రాగ్‌పై కొన్ని తప్పులు చేశాను. కానీ నేను ఈ ఆటగాళ్ల కంటే (గుకేశ్, ప్రాగ్) తక్కువ అని నాకు ఎప్పుడూ అనిపించలేదు. నేను వారితో సమంగా ఉన్నా అని భావిస్తున్నా..' అని మిశ్రా తన విజయం అనంతరం అన్నాడు.
అలాగే ఆర్.ప్రజ్ఞానందకు జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్ వల్ల షాక్ తగిలింది. అతడు 55 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై విజయం సాధించాడు.

# టీ20 వరల్డ్‌కప్2026 టోర్నీకి డేట్స్ ఫిక్స్..! వివరాలు ఇవే




భారత్, శ్రీలంక వేదికలగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్2026కు తేదీలను ఐసీసీ ఖరారు చేసినట్లు తెలుస్తోంది ఈఎస్పీఎన్ రిపోర్ట్ ప్రకారం.. ఈ మెగా టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వరకు జరగనున్నట్లు సమాచారం. ఐపీఎల్2026కు ముందే ఈ పొట్టి ప్రపంచకప్ జరగనుంది.
ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొనున్నాయి. ఈ మార్క్యూ ఈవెంట్‌కు శ్రీలంక, భారత్‌లోని మొత్తం ఐదు స్టేడియాలు ఆతిథ్యమివ్వనున్నాయి. అయితే సదరు రిపోర్ట్ ప్రకారం.. ఈ టోర్నీకి సంబంధించి షెడ్యూల్‌ను మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇంకా ఫైనలైజ్ చేయలేదంట.కానీ ఫైనల్ మ్యాచ్‌కు వేదికలగా అహ్మదాబాద్, కొలంబోలను పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ పాక్ ఫైనల్‌కు చేరుకుంటే కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో తుది పోరు జరిగే అవకాశముంది.
ఫార్మాట్ ఇదే..
ఇక టీ20 వరల్డ్‌కప్2026 ఫార్మాట్ విషయానికి వస్తే.. గత ఎడిషన్ మాదిరిగానే నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో పాల్గొనే మొత్తం జట్లను నాలుగు గ్రూపులగా విభజిస్తారు. ప్రతీ గ్రూపులో ఐదు జట్లు ఉంటాయి. లీగ్ స్టేజిలో ప్రతీ జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడుతోంది. లీగ్ దశ ముగిసే సమయానికి ప్రతీ గ్రూపులో టాప్ 2లో నిలిచే జట్లు సూపర్ 8కు అర్హత సాధిస్తాయి. సూపర్ 8 రౌండ్‌లో టాప్ 4 జట్లు సెమీఫైనల్లో అడుగుపెడతాయి. ఆ తర్వాత సెమీస్‌లో గెలిచిన రెండు జట్లు ఫైనల్లో తలపడతాయి.
ఈ ప్రపంచకప్‌లో ఓవరాల్‌గా 55 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రస్తుతం ఈ మెగా టోర్నీ కోసం 15 జట్లు తమ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. మిగిలిన ఐదు జట్లు ఆఫ్రికన్, ఆసియా, తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్ నుంచి అర్హత సాధించనున్నాయి.

# సౌతాఫ్రికా టీ20 లీగ్ వేలంలో గంగూలీ మార్క్..




టీమిండియా దిగ్గజం సౌరవ్ గంగూలీ.. ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా తన పనని మొదలు పెట్టాడు.
జోహన్నెస్‌బర్గ్ వేదికగా జరుగుతున్న సౌతాఫ్రికా టీ20 లీగ్-2026 వేలంలో గంగూలీ తన మార్క్‌ను చూపించాడు.
అత్యధిక పర్స్ వాల్యూతో వేలంలోకి వచ్చిన ప్రిటోరియా క్యాపిటల్స్.. తొలి ఆటగాడిగా సౌతాఫ్రికా స్టార్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌ను సొంతం చేసుకుంది.సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ యజమాని కావ్య మారన్‌తో పోటీపడి మరి 1.7 మిలియన్ ర్యాండ్లు(సుమారు రూ. 85 లక్షలు)కు మహారాజ్‌ను ప్రిటోరియా దక్కించుకుంది. అతడిని సొంతం చేసుకోవడంలో గంగూలీది కీలక పాత్ర. ఆ తర్వాత సౌతాఫ్రికా టీ20 వేలంలో పది మిలియన్ ర్యాండ్లు దాటిన మొదటి ఆటగాడిగా నిలిచిన ఐడెన్ మార్‌క్రమ్ కోసం కూడా ప్రిటోరియా తీవ్రంగా ప్రయత్నించింది. కానీ డర్బన్ సూపర్ జెయింట్స్ గట్టీ పోటీ ఇవ్వడంతో క్యాపిటల్స్ వెనక్కి తగ్గింది. మార్‌క్రమ్‌ను డర్బన్ సూపర్ జెయింట్స్ రికార్డు స్థాయిలో రూ. 7 కోట్లకు కొనుగోలు చేసింది.
క్యాపిటల్స్‌లోకి బ్రెవిస్..
ఇక మార్‌క్రమ్‌ను దక్కించుకోవడంలో విఫలమైన సౌరవ్ గంగూలీ.. సౌతాఫ్రికా సూపర్ స్టార్ డెవాల్డ్ బ్రెవిస్‌ను మాత్రం ఆఖరివరకు పోటీపడి మరి తమ జట్టులోకి తీసుకొచ్చాడు. ప్రిటోరియా క్యాపిటల్స్ అతడి కోసం ఏకంగా రూ. 8.3 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది.
దీంతో ఎస్ఎ టీ20 లీగ్ హిస్టరీలోనే అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా 22 ఏళ్ల బ్రెవిస్ నిలిచాడు. బ్రెవిస్ కోసం జోబర్గ్ సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లేమింగ్ కూడా ఆఖరి వరకు ప్రయత్నించాడు. కానీ ప్రిటోరియా క్యాపిటల్స్ మాత్రం ఎక్కడ వెనక్కి తగ్గలేదు. అదేవిధంగా గంగూలీ అండ్ కో ప్రోటీస్ స్టార్ ఫాస్ట్ బౌలర్ లుంగి ఎంగిడీని సైతం సొంతం చేసుకున్నారు.
కాగా ప్రిటోరియా క్యాపిటల్స్ ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్ సిస్టర్ ఫ్రాంచైజీ కావడం విశేషం. ఈ ఏడాది ఆగస్టులో ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా గంగూలీ ఎంపికయ్యాడు. గత కొన్ని ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్‌గా గంగూలీ వ్యహరించిన సంగతి తెలిసిందే.

# యూఈఏతో మ్యాచ్..

## భారత తుది జట్టు ఇదే! శాంసన్‌కు నో ఛాన్స్




ఆసియాకప్2025లో తమ తొలి మ్యాచ్‌కు టీమిండియా సిద్దమైంది. సెప్టెంబర్ 10న అబుదాబి వేదికగా యూఈఏతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి టోర్నీలో శుభారంభం చేయాలని భారత జట్టు భావిస్తోంది. ఈ క్రమంలో యూఏఈతో మ్యాచ్‌కు టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అంచనా వేశాడు.
తన ఎంచుకున్న తుది జట్టులో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఛాన్స్ ఇచ్చాడు. ఈ జట్టులో సంజూ శాంసన్‌కు మాత్రం చోటు దక్కలేదు. అతడి స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్‌గా జితేష్ శర్మను శ్రీకాంత్ ఎంపిక చేశాడు. మిడిలార్డర్‌లో తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబేలతో అతడు వెళ్లాడు.
తిలక్ వర్మ ప్రస్తుతం అద్బుతమైన ఫామ్‌లో ఉన్నాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌తో పాటు ఐపీఎల్2025లో దుమ్ములేపాడు. దీంతో అతడికి భారత తుది జట్టులో చోటు ఖాయం. ఇక ఆల్‌రౌండర్లగా హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌కు ఈ తమిళనాడు క్రికెటర్ అవకాశమిచ్చాడు.
అదేవిధంగా ఫాస్ట్ బౌలర్ల కోటాలో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లకు చోటు దక్కింది. ఇక స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తికి ఛాన్స్ లభించింది. అయితే గిల్ తిరిగి రావడంతో తుది జట్టులో సంజూ శాంసన్ స్దానంపై సందిగ్ధం కొనసాగుతోంది.
కానీ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందన్న సంకేతాలు ఇచ్చాడు. సంజూ ప్రస్తుతం టీ20 క్రికెట్ లో దుమ్ములేపుతున్నాడు.
ఐపీఎల్2025తో పాటు కేరళ క్రికెట్ లీగ్ టోర్నీలోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. మరోవైపు జితేష్ కూడా ఐపీఎల్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేశాడు. టీమ్ మెనేజ్‌మెంట్‌కు ఇదొక కఠిన సవాల్ అనే చెప్పుకోవాలి. మరి సూర్య అండ్ గంభీర్ ఎవరివైపు మొగ్గు చూపుతారో బుధవారం వరకు వేచి చూడాల్సిందే
యూఏఈతో మ్యాచ్‌కు శ్రీకాంత్ అంచనా వేసిన భారత తుది జట్టు: అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్

# అప్పుడు శుభ్‌మన్ గిల్‌తో కలిసి శిక్షణ.. ఇప్పుడు ఆసియాకప్‌లో ప్రత్యర్థిగా..




టీమ్ఇండియా .. ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 10న తన మొదటి మ్యాచ్‌ను యూఏఈతో ఆడనుంది. ఈసందర్భంగా యూఏఈ ఆటగాడు సిమ్రన్‌జిత్ సింగ్ .. తనకు శుభ్‌మన్ గిల్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 35 ఏళ్ల సిమ్రన్‌జిత్ సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని లూథియానా. 12 ఏళ్ల క్రితం తాను మొహాలిలోని పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో శుభ్‌మన్‌గిల్‌తో కలిసి సాధన చేసిన రోజుల గురించి వివరించాడు. 'శుభ్‌మన్ గిల్ చిన్నప్పటినుంచే నాకు తెలుసు. కానీ అతడికి నేను గుర్తున్నానో లేదో నాకు తెలియదు. 2011-12 ప్రాంతంలో గిల్‌కు 11 లేదా 12 సంవత్సరాల వయసు ఉంటుందనుకుంటా. అప్పుడు మేం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మొహాలిలోని పీసీఏ అకాడమీలో శిక్షణ పొందేవాళ్లం. ఉదయం 11 గంటల ప్రాంతంలో గిల్ తన తండ్రితో కలిసి వచ్చేవాడు' అని సిమ్రన్ జిత్‌సింగ్ వివరించాడు. 'నేను మా సెషన్ తర్వాత కూడా చాలా సమయం పాటు బౌలింగ్ చేస్తూ గడిపేవాణ్ణి. ఇప్పుడు గిల్ నన్ను గుర్తుపడతాడో లేదో తెలియదు.. కానీ నేను ఆ రోజుల్లో అతడికి చాలాసార్లు బౌలింగ్ చేశాను' అని గతాన్ని నెమరువేసుకున్నాడు.
సూర్యకుమార్ కొడితే.. ఆసియా కప్ మనదే!
'నేను పంజాబ్‌లో జిల్లాస్థాయిలో చాలా క్రికెట్ ఆడాను. చివరికి 2017లో రంజీ ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకున్నాను. గతంలో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు మొహాలిలో సెషన్‌లు నిర్వహించినప్పడల్లా నేను ఆ టీమ్ నెట్స్‌లో చాలా బౌలింగ్ చేశాను' అని అతడు గుర్తు చేసుకున్నాడు.
కొవిడ్-19 తన జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందో కూడా ఈ స్పిన్నర్ వివరించాడు. 'ఓసారి నాకు దుబాయ్‌లో ప్రాక్టీస్ చేయడానికి ఆఫర్ వచ్చింది. ఏప్రిల్ 2021లో 20 రోజుల కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు కొవిడ్ సెకండ్ వేవ్ వల్ల భారతదేశంలో మరో లాక్‌డౌన్ విధించారు. దీంతో నేను నెలలతరబడి తిరిగి వెళ్లలేకపోయాను. చివరికి అక్కడే ఉండిపోయాను. తర్వాత ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుతో ఒప్పందం లభించింది' అని సిమ్రాన్‌జీత్ పేర్కొన్నాడు